## క్లుప్తంగా

### నేడు గడప గడపకు మన ప్రభుత్వం

రామకుప్పం: మండలంలోని నారాయణపురం తండా పంచాయతీ పరిధిలో శుక్రవారం ఉదయం 7 గంటలకు చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి తెలిపారు. కార్యక్రమానికి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరవ్వాలని కోరారు.

### నాడు-నేడు పనుల వేగవంతం



నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న వెంకటరమణారెడ్డి

పలమనేరు: మండలంలో నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని జిల్లా ప్రాజెక్టు అధికారి వెంకటరమణారెడ్డి ఆదేశించారు. పట్టణంలోని విద్యానగర్ పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను గురువారం ఆయన పరిశీలించారు. జూన్ 12 కల్లా అన్ని బడుల్లో ఈ పనులను పూర్తిచేయాలని సంబంధిత హెచ్‌ఎంలను ఆదేశించారు. ఎంఈఓ లీలారాణి, సీఆర్పీలు పాల్గొన్నారు.

### మున్సిపల్ సమావేశం రేపు

పుంగనూరు: మున్సిపాలిటీ సాధారణ సమావేశం ఈనెల 29న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. సాధారణ సమావేశానికి సభ్యులు, అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో కోరారు.

### సూక్ష్మ సేద్యంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సదుం: స్థానిక సీఎల్‌ఆర్సీ భవనంలో సూక్ష్మ సేద్యంపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఆచార్య ఎన్‌జీ రంగా వర్సిటీ, వాటర్‌షెడ్ ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మైక్రో ఇరిగేషన్ జిల్లా అధికారి హరినారాయణస్వామి సూక్ష్మ సేద్యంలో అధునాతన పద్ధతులు, బిందు, తుంపర సేద్యం, వాటిని అమర్చుకునే విధానం, రాయితీ వివరాలు, డ్రిప్‌తో ఎరువుల వినియోగం అనే అంశాలను వివరించారు. వాటర్‌షెడ్ ద్వారా అమలు చేసే పద్ధతులను పీఓ శోభారాణి వివరించారు. కేవీకే శాస్త్రవేత్త సుధారాణి పాల్గొన్నారు.

### ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో నేతలు

సోమల: మండలంలోని నంజంపేట-పొదల గుంటపల్లె మార్గంలోని దళవాయిచెరువు కట్టపై ఉన్న గంగమ్మ గుడి గతంలో వర్షాల కారణంగా చెట్టు పడి దెబ్బతింది. దీంతో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు, ఎంపీటీసీ నాగభూషణం రెడ్డి, సర్పంచ్ జయరాం, స్థానిక పంచాయతీల ప్రజల సహకారంతో గురువారం గుడి పునర్నిర్మాణం కోసం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. సచివాలయ కన్వీనర్ సిద్దయ్య, స్థానిక నేతలు సురేంద్ర, గుంజి రమణ, ఆనంద్, వెంకటరమణ, వెంకటయ్య, ఉప సర్పంచ్ అశ్విని, పీసీ కమిటీ చైర్మన్ కవిత పాల్గొన్నారు.

### వేలంలో రూ.38వేల ఆదాయం

గంగవరం: మండలంలోని పలు కేసుల్లో స్వాధీనం చేసుకుని సీజ్ చేసిన ద్విచక్రవాహనాలకు జిల్లా ఎస్‌ఈబీ ఏఈఎస్ ఆయేషాబేగం ఆధ్వర్యంలో గురువారం వేలం పాట నిర్వహించారు. మూడు ద్విచక్రవాహనాలకుగాను రూ.38 వేల ఆదాయం వచ్చినట్లు ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

### భవన కార్మికులకు వైద్యసేవలు

పుంగనూరు: మేడేను పురస్కరించుకుని భవన కార్మికులకు పట్టణంలోని లయన్స్‌క్లబ్‌లో ఉచిత వైద్యసేవలు అందించారు. గురువారం లయన్స్ క్లబ్ పీఆర్‌ఓ డాక్టర్ శివ ఆధ్వర్యంలో కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాలకు చెందిన వైద్యులచే శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి ఈశ్వరమ్మ, ప్రతినిధులు గోపాలకృష్ణ, త్రిమూర్తి రెడ్డి, రజి అహ్మద్ పాల్గొన్నారు.

### వంతెన పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న నేతలు

సదుం: స్థానిక గార్గేయనదిపై రూ.8కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న వంతెన పనులను జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి గురువారం పరిశీలించారు. వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం తాత్కాలికంగా వాహనాల రాకపోకలను అనుమతిస్తున్నట్టు ఆయన చెప్పారు. పది రోజుల్లో పూర్తిస్థాయిలో రాకపోకలు ప్రారంభమవుతాయని తెలిపారు. సర్పంచ్ మనోహర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, వెంకటరెడ్డి, ఎల్లారెడ్డి, భాస్కర పాల్గొన్నారు.

# ప్రారంభోత్సవాలతో మంత్రి పెద్దిరెడ్డి బిజీ బిజీ

- మున్సిపల్ కార్యాలయం, మున్సిపల్ కాంప్లెక్స్, సింగిల్ విండో భవనానికి శంకుస్థాపన
- రాజన్న క్యాంటీన్ ప్రారంభం



సచివాలయ ప్రారంభోత్సవంలో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్

కుప్పం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుప్పం మున్సిపాలిటీ పర్యటన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో బిజీబిజీగా గురువారం సాగింది. రూ.3.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ప్రసన్న తిరుపతి గంగమ్మ దేవాలయ పనులు పరిశీలించి అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు పూజలు చేశారు. అనంతరం దేవాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన రాజన్న క్యాంటిన్ ప్రారంభించి అన్నదానం చేశారు. రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మున్సిపల్ కార్యాలయానికి భూమిపూజ చేపట్టి పనులకు శ్రీకారం చుట్టారు. రూ.50 లక్షల మున్సిపల్ కాంప్లెక్స్‌కు భూమి పూజ చేశారు. అదేవిధంగా రూ.50 లక్షలతో సింగిల్ విండో కార్యాలయ భవనానికి భూమిపూజ చేశారు. రూ.20 లక్షల ఎంపీ నిధులతో నిర్మించి కుప్పం ప్రెస్‌క్లబ్ భవనాన్ని ప్రారంభించారు. జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, నియోజకవర్గ పరిశీలకులు మొగసాల రెడ్డెప్ప, సింగిల్ విండో చైర్మన్ తిమ్మోజీ గౌడ్ పాల్గొన్నారు.

**శాంతిపురంలో..**

శాంతిపురం: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



రాజన్న క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సొన్నేగానిపల్లిలో రూ.25 లక్షలతో ఆధునీకరించిన సచివాలయ భవనాన్ని, రూ.21 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. దండికుప్పం పంచాయతీలోని చొడంపల్లి క్రాస్ వద్ద రూ.15 లక్షలతో నిర్మించిన హార్టికల్చర్ కలెక్షన్ పాయింట్‌ను, మహిళా సంఘాల పాల సేకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. అక్కడే నిర్మించిన ఆర్బీని ప్రారంభించి గ్రామంలో శ్రీకోదండరామస్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొన్నారు. చొడంపల్లిలో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని, నల్లరాళ్లపల్లిలో నిర్మించిన కమ్యూనిటీ హాలు, రచ్చబండలను ప్రారంభించారు. జెడ్పీ చైర్మన్ జి.శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, డీఆర్‌డీఏ పీడీ తులసి, ఎంపీపీ వసుంధర, జెడ్పీటీసీ శ్రీనివాసులు, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి పాల్గొన్నారు.

## మంత్రి పెద్దిరెడ్డికి ఘనస్వాగతం

వి.కోట: కుప్పం పర్యటనలో భాగంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వి.కోటకు విచ్చేశారు. ఈ సందర్భంగా మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులు మంత్రికి పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ యువరాజు, పార్టీ మండల కన్వీనర్ బాలగురునాథ్, రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు పాల్గొన్నారు.

రామకుప్పం: మంత్రి పెద్దిరెడ్డి కుప్పం పర్యటన నేపథ్యంలో గురువారం రాజుపేట రోడ్డు సమీపంలో చిత్తూరు ఎమ్మెల్సీ భరత్, మండల వైఎస్సార్ సీపీ నేతలు మంత్రికి ఘనస్వాగతం పలికారు. పార్టీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీ



మంత్రి పెద్దిరెడ్డికి స్వాగతం పలుకుతున్న నేతలు

టీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో కన్వీనర్ చంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ ఆరేళ్ల జయప్ప, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, సింగిల్‌విండో అధ్యక్షుడు వేణప్ప గౌడ్, సీనియర్ నేత మధుసూదన్ రెడ్డి, రెస్కో డైరెక్టర్ రవి నాయక్ పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో అభ్యసిస్తే విజయం తథ్యం

వి.కోట: క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే విజయం తథ్యమని ఎంఈఓ చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని తెట్టు ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ చేతుల మీదుగా సరస్వతీ పూజ చేశారు. అనంతరం వివిధ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల హెచ్‌ఎం రఘుపతి, ఉపాధ్యాయులు రజిని, శివరాజు తారక్, రజిని, పాఠశాల చైర్మన్ గోపి, ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం ఇలియాజ్ పాల్గొన్నారు.



సరస్వతీ పూజలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

# బండ్లపల్లె విద్యార్థిని ప్రతిభ

పుంగనూరు: మండలంలోని బండ్లపల్లెకు చెందిన గురివిరెడ్డి, సునీత దంపతుల కుమార్తె సి.ప్రియాంక గురువారం తిరుపతిలోని మహతిలో ఎంబీబీఎస్ కాన్వకేషన్ అందుకున్నారు. ఇక్కడ జరిగిన కాన్వకేషన్ కార్యక్రమానికి టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డి, స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మ హాజరై ప్రియాంకకు అందజేశారు. ఎస్వీ మెడికల్ కళాశాలలో డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణురాలైన సునీత కాన్వకేషన్‌ను తీసుకోవడంపై పలువురు ఆమెను అభినందించారు.



కాన్వకేషన్‌ను తీసుకుంటున్న ప్రియాంకతో వెంగమ్మ

## కరెంట్ పెడితే క్రిమినల్ చర్యలు



ఎఫ్‌ఆర్వో నయూమ్ అలీ

పలమనేరు: అడవి జంతువుల నుంచి రక్షణ పేరిట వన్యప్రాణుల వేటకోసం రైతులు వారి పంటపొలాల్లో కరెంట్ తీగలను పెడితే క్రిమినల్ కేసులు తప్పవని పలమనేరు ఎఫ్‌ఆర్వో నయూమ్ అలీ హెచ్చరించారు. పట్టణంలోని ఆయన కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది వేటగాళ్లు 11కేవీలైన్ల కరెంట్‌ను తీగల ద్వారా కట్టెలకు కట్టి అడవికి సమీపంలోని పొలాల్లో పెడుతున్నారన్నారు. ఇలాంటి సంఘటన కారణంగా ఇప్పటిదాకా పదేళ్లలో 18 ఏనుగులు మృతిచెందాయన్నారు. దీంతో పాటు వేటగాళ్ల కరెంట్ కారణంగా అమాయకులైన 12మంది మృతిచెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి నేరాలకు పాల్పడేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

## యాళి వాహనంపై ఊరేగిన మృత్యుంజయేశ్వరుడు

చౌడేపల్లె: స్థానిక బజారువీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజైన గురువారం రాత్రి స్వామివారిని యాళివాహనంపై ఊరేగించారు. అర్చకులు రాజశేఖర దీక్షితులు, కుమారస్వామి, మహేష్ శివపార్వతుల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి యాళివాహనంపై స్వామివారిని కొలువుదీర్చారు. అనంతరం పురవీధుల్లో ఊరేగించారు ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా కె.అశోక్‌కుమార్, సుదర్శన్ కుటుంబీకులు వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కళాకారులు వేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

# ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



బాబు (ఫైల్)

బైరెడ్డిపల్లె: ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయినందుకు మనస్తాపంతో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బైరెడ్డిపల్లెకు చెందిన క్రిష్ణప్ప కుమారుడు బాబు (19) ఎంపీసీ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివాడు. బుధవారం వెలువడిన ఫలితాల్లో బాబు గణితం-బీ (మ్యాథ్స్) సబ్జెక్టులో తప్పినందుకు మనస్తాపం చెంది రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఎస్‌ఐ వెంకటనరసింహులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అభినందనలు



ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ పంచాయతీలుగా అవార్డులు పొందిన సర్పంచులకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ప్రశంసాపత్రాలను అందజేసి అభినందలు తెలియజేశారు. - చౌడేపల్లె

## తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సు

పలమనేరు: పలమనేరు డిపో నుంచి తమిళనాడు రాష్ట్రంలోని తిరువణ్ణామలైకి వచ్చే పౌర్ణమి మే నాలుగున ప్రత్యేక బస్సును నడపనున్నట్టు స్థానిక డిపోమేనేజర్ రామక్రిష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్కడ పౌర్ణమి సందర్భంగా జరిగే గిరిప్రదక్షిణలో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం ఈ సర్వీసును నడుపుతున్నట్టు అందులో తెలిపారు. ఈ బస్సు పౌర్ణమి రోజున పట్టణంలో మధ్యాహ్నం 2 గంటలకు బయలదేరి తిరువణ్ణామలైకి సాయంత్రం ఆరున్నర గంటలకు చేరుకుంటుందని తెలిపారు. అదే రోజు రాత్రి 2 గంటలకు బస్సు బయలదేరి ఉదయం ఆరున్నర గంటలకు పలమనేరుకు చేరుకుంటుందని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## చోరీల నివారణకు సహకారం కావాలి



డీఎస్పీ సుధాకర్‌రెడ్డి

పలమనేరు: పలమనేరు సబ్ డివిజన్ పరిధిలో ఇళ్లల్లో చోరీలు జరగకుండా ఉండేందుకు పోలీసులకు ప్రజల సహకారం కావాలని పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి సూచించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు బంగారు వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలన్నారు. సెలవుల్లో ఊరికి వెళ్లే వాళ్లు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

## ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ



ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లు, గదులు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం మండల స్థాయి అధికారులతో మాట్లాడారు. గ్రామాల్లో జరుగుతున్న గృహనిర్మాణ పనులు, తాగునీటి సౌకర్యం, పరిసరాల పరిశుభ్రత, స్పందన అర్జీలను పరిష్కరించుట, 15వ ఆర్థిక సంవత్సర నిధుల వివరాలపై చర్చించారు. ఎంపీడీఓ రాజేంద్రబాలాజి పాల్గొన్నారు.

## జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం

సదుం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎం చేయడానికి అందరూ కలిసికట్టుగా కృషిచేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి తెలిపారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో గురువారం దళిత సంఘం నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. డాక్టర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తూ బడు గు, బలహీన వర్గాల జీవన ప్రమాణాలు, ఆర్థిక పురోగతికి కృషిచేస్తున్నారని చెప్పారు. కావున అందరూ ఐకమత్యంగా రానున్న ఎన్నికల్లో ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాని కోరారు. సీతాపతి, మాధవయ్య, రాజేష్, మదన్ పాల్గొన్నారు.

## ఆధార్ నమోదుకు స్పందన



ఆధార్ కేంద్రంలో చిన్నారుల తల్లులు

పెద్దపంజాణి: పెద్దపంజాణి గ్రామ సచివాలయ పరిధిలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రానికి విశేష స్పందన లభించింది. మండలంలో ఆధార్ నమోదుకాని ఐదేళ్లలోపు చిన్నారులు ఎక్కువగా ఉన్నారని గుర్తించిన ఎంపీడీఓ టి.శ్రీనివాస విశ్వనాథ్ ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. మూడు కేంద్రాలను ఏర్పాటు చేయించి 145 మంది చిన్నారులకు ఆధార్ నమోదు చేయించారు. పీఎస్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే ధ్యేయం



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- పార్టీలకు అతీతంగా పథకాల అమలు
- పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి: ప్రజా సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే డా. వెంకటేగౌడ అన్నారు. గురువారం మండలంలోని అమ్మరాజుపల్లి, కురప్పల్లి, ఎగువ, దిగివ బందార్లపల్లిలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలు చేస్తున్న సంక్షేమ లబ్ధిని వివరించి సంక్షేమ లబ్ధి బుక్‌లెట్లను అందజేశారు. స్థానికులు ఆయన దృష్టికి పలు సమస్యలు తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**సచివాలయ భవనం ప్రారంభం..**

అమ్మరాజుపల్లిలో రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తోందని పేర్కొన్నారు. పసుపు కుంకుమ పేరుతో చంద్రబాబు మహిళలను మోసం చేస్తే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అండగా నిలిచారన్నారు. గతంలో పింఛన్లు, రేషన్ కార్డుల కోసం కార్యాలయాలు, జన్మభూమి కమిటీ నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, జగనన్న ప్రభుత్వంలో సచివాలయాలు, వలంటీర్ల ద్వారా అన్ని పథకాలు ఇంటి వద్దకే వస్తున్నాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. అమ్మరాజుపల్లి ఎంపీపీ పాఠశాల వార్షికోత్సవంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ సతీమణి పావని గౌడతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సుష్మకీర్తి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీ జీడీ బాబు, సర్పంచ్ స్వర్ణలత, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు తమ్మిరెడ్డి, మాకయ్య, ఏఎంసీ డైరెక్టర్లు ఎర్రబల్లి శ్రీనివాసులు, సురేష్, ఎంపీటీసీ వెంకటరత్నమ్మ, మండల వ్యవసాయ మండలి చైర్మన్ వెంకటరమణారెడ్డి, నేతలు శంకరప్ప, రాజారెడ్డి, శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్, తహసీల్దార్ హనుమంతు, ఎంఈఓ హేమలత, పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

**నేడు గడప గడపకు..**

బొమ్మరాజుపల్లి, కంగానంబండ, కుంటకిందపల్లి, వలసపల్లిలలో నేడు శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు.

# జగనన్న పాలనలోనే సంక్షేమం

పులిచెర్ల(కల్లూరు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధిపై పరుగులు పెడుతోందని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. గురువారం రాత్రి ఎర్రపాపిరెడ్డిగారిపల్లె పంచాయతీలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

# ప్రభుత్వ కళాశాల విద్యార్థినుల హవా



యశోధ



కీర్తి

రొంపిచెర్ల: రొంపిచెర్ల కస్తూరిబా గురుకుల కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో మెరిశారు. కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం సీఈసీ చదువుతున్న పీలేరు మండలం సుగాలితాండాకు చెందిన యశోద 1000 మార్కులకుగాను 935 మార్కులు సాధించారు. అలాగే ఇంటర్ సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్న వెదురుకుప్పం మండలానికి చెందిన కీర్తి 500 మార్కులకుగాను 420 మార్కులు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 27 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా 16 మంది పాస్ అయ్యారని కేజీబీవీ ఎస్‌ఓ సుజాత తెలిపారు. ఇంటర్ రెండవ సంవత్సరంలో 30 మంది పరీక్షలు వ్రాయగా 18 మంది పాస్ అయ్యారని తెలిపారు. విద్యార్థునులు యశోద, కీర్తిలను ఏస్‌ఓ, ఉపాధ్యాయులు అభినందించారు.

**ప్రతిభ చాటిన ఆదర్శ విద్యార్థులు**

పుంగనూరు: మండలంలోని అడవినాథునికుంట లోగల ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు అధిక మార్కులు సాధించి ఆదర్శంగా నిలిచారు. గురువారం ప్రిన్సిపల్ టిఎస్.రమ తెలిపిన వివరాల మేరకు.. ఇంటర్ మొదటి సంవత్సరంలో బైపీసీ విద్యార్థిని పి.శ్రావణి 406, బి.పల్లవి 388 మార్కులు సాధించారు. సీఈసీలో భరత్‌కుమార్ 444 మార్కులు, ఎంఈసీలో జీవన్‌కుమార్ 369 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎల్.స్నేహా 928 మార్కులు, సీపీ.భవ్య, బైపీసీలో 906 మార్కులు, కె.విక్రమ్ సీఈసీలో 846 మార్కులు సాధించారు. అలాగే బసవరాజ ప్రభుత్వ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న పి.పవిత్ర ఎంపీసీలో 932 మార్కులు, సి.నాగవేణి సీఈసీలో 921 మార్కులు, కె.పవిత్ర హెచ్‌ఈసిలో 943 మార్కులు, ఎస్.మోసినా ఓకల్ సీఈసీలో 970 మార్కులు సాధించారు. వీరిని ప్రిన్సిపల్స్ కమలాకర్, రమ, లెక్చరర్లు అభినందించారు.

**టాపర్‌లకు బహుమతులు**


గుడుపల్లె: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో టాపర్‌లుగా నిలచిన విద్యార్థులకు నగదు బహుమతులను కళాశాల ప్రిన్సిపల్ వెన్నెల అందించారు. మొదటి, ద్వితీయ సంవత్సరంలో 90 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.516 నగదును అందజేశారు. గుడుపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సంలో 36 శాతం, ద్వితీయ సంవత్సరంలో 58 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఆదర్శ పాఠశాలలో మొదటి సంవత్సరం 26 శాతం, ద్వితీయ సంవత్సరంలో 35 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు.

**65శాతం ఉత్తీర్ణత**


చౌడేపల్లె: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 65 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపల్ సాయిశంకర్‌రెడ్డి గురువారం తెలిపారు. 125 మంది పరీక్షలకు హాజరుకాగా వారిలో 80 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల టాపర్‌గా టి హిమబిందు (బైపీసీ) 888 మార్కులు, ద్వితీయస్థానం బి.మహిమకుమారి (సీఈసీ) 817 మార్కులు, తృతీయ స్థానం రమ్య (హె చ్‌ఈసీ) 792, పి.ఆనందబాబు ఎంపీసీ 742 మార్కులు, సి.భానుప్రియ సీఈసీ 817 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 45 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. 93 మందికిగానూ 30 మంది విద్యార్థులు పాసైనట్లు ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

సోమల: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో ప్రతిభ చూపారని ప్రిన్సిపల్ గంగాధరం నాయుడు, హిస్టరీ అధ్యాపకుడు జయరాం బుధవారం సాయంత్ర తెలిపారు. రెండవ సంవత్సరం విద్యార్థిని చందన ఎంపీహెచ్‌డబ్ల్యూలో 954 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిందన్నారు. ఎంపీసీ విద్యార్థిని ఆసియా బేగం 940 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిందని చెప్పారు. రెండో సంవత్సరంలో 101 మందికి 63 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే మొదటి సంవత్సరంలో విద్యార్థిని పి.చందన ఎంపీహెచ్‌డబ్ల్యూలో 425 మార్కులతో మొదటిస్థానంలో నిలవగా నాగమణి ఎంపీహెచ్‌డబ్ల్యూలో 418 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. మొదటి సంవత్సరంలో 77 మంది గానూ 25 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వారు తెలిపారు.

# మళ్లీ రోడ్డు మీద 'గజ గజ'



ముసలిమడుగు వద్ద రోడ్డు పైకొచ్చిన ఏనుగుల గుంపు,



ఏనుగుల దాడిలో దెబ్బతిన్న వరి పంట

పలమనేరు: మండలంలోని మొసలిమడుగు దర్గా వద్ద పలమనేరు-గుడియాత్తం రహదారిలో గురువారం ఉదయం 22 ఏనుగులు ప్రత్యక్షమయ్యాయి. దీంతో ఆమార్గంలో వెళ్లేవారు హడలిపోయారు. కొంతసేపు ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. విషయం తెలుసుకున్న ఎలిఫెంట్ ట్రాకర్స్ వాటిని అడవిలోకి మళ్లించారు.

**పంటలపై దాడి**

ఇదిలా ఉండగా, ఏనుగులు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం, క్రిష్ణప్ప, నిర్మలమ్మకు చెందిన వరి, టమాట, మామిడి పంటలకు నష్టం కలిగించాయి. పంట నష్టాన్ని స్థానిక అటవీశాఖ సిబ్బంది అంచనా వేసి నష్టపరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు.